**వెలగాడ** కొండలా నల్లగా, నునుపుగా ఉన్నాడు సింహాచలం. అతని వయస్సు నలభై పైన, ఏభై లోపు ఎంతయినా కావచ్చు. కాయకష్టం చేసి రాటు దేలిన వాడిలా అతని చేతులు మొరటుగా ఉన్నాయి. కళ్ళు ఎర్రగా ఉన్నా—అతనిప్పుడు తాగుడు మైకంలో లేడు. అతని వక్షస్థలం విశాలంగా ఉంది. అతని ముఖంలో మృదుత్వం లేదు. జాలి, కరుణ అంటే ఏమిటో తెలీనట్లున్నాయి అతని హావ భావాలు. కానీ, తోటి మనుషుల్ని ఉత్తి పుణ్యానికి నమిలి మింగేసే వాడిలాకూడా లేడు.


సింహాచలం ఎక్స్ సర్వీస్ మన్.

అంటే మాజీ సిపాయి.

లోకం అంటే వెంగాడకొండతో సరి—అని నమ్మే ఆ వూరి ప్రజలకు సింహాచలం ఒక మహా వీరుడు.

సరిగా ఇరవై సంవత్సరాల క్రితం వూరు వదిలి పోయాడు సింహాచలం—గేదెకు సరిగా గడ్డి కోయ లేదని తండ్రి చేత చావు దెబ్బలు తిని, ఆ జీవితం కంటే ఎక్కడయినా మెరుగే ననిపించి ఒక రోజు చెప్పా పెట్టకుండా ఉడాయించేశాడు. అతను నెల్లిమర్లలో పాసింజరు బండెక్కడం ఎవరో చూశారు. అంతే. ఆ తరవాత సింహాచలం ఆచూకీ ఎవరికీ తెలీదు.

ముదురాకు పచ్చ యూని ఫారంలో ఇరవై సంవత్సరాల తరవాత ఆ వూర్లో అడుగు పెట్టిన సింహాచలాన్ని మొదట ఎవరూ గుర్తించ లేదు.




# న్యాయం

ఎమ్. వి. ఆర్. రాధాకృష్ణ

అతన్నా బట్టల్లో చూసి కొండ చిలువను చూసిన కోతుల్లా జనం పారి పోయారు. అంతకు ముందొకసారి ఎవడో కేటుగాడి కోసమని చెప్పి వూర్లో చొరబడి నానా హంగామా చేసి పోయారు. వాళ్ళు వెళ్ళిపోయాక చూసుకుంటే—నాలుగు గొర్రెలు, పది కోళ్ళు, రెండు బస్తాల ముతక బియ్యం, ఎవరో ముచ్చట పడి కొనుక్కున్న రెండు స్టీలు గ్లాసులు కనిపించ లేదు. అడవిని చిందర వందరగా కలియ తొక్కిన ఏనుగుల్లా వాళ్ళు సరదాలు తీర్చుకుని, నింపాదిగా వెళ్ళి పోయిన తరవాత వూరు కుప్పలా తయారయింది.

అందుకే సింహాచలాన్ని చూసి మున్సిపాలిటీ బండిని చూసి తోక ముడిచిన కుక్కల్లా అనుమానంగా, భయంగా చూశారందరూ! కానీ, వచ్చిన వాడు సింహాచల మని తెలీగానే అందరూ బిలబిల అతన్ని చుట్టేశారు.

సింహాచలం తిరిగి వచ్చే సరికి తండ్రి చచ్చిపోయాడు. తల్లి బాగా ముసల్దయి పోయింది.

"నా నొచ్చీసి నాను. మా అమ్మకేటి నోటు!" అన్నాడు సింహాచలం.

అతను ఇంతవరకూ పెళ్ళి చేసుకో లేదు. ఇక ముందు చేసుకోవాలనే అభిప్రాయం కూడా ఉన్నట్లు లేదు. హరికథా కాల క్షేపంలా రోజూ రాత్రి ఇంటి అరుగు మీద కూర్చుని చుట్టూ చేరిన వాళ్ళకు తన అనుభవాలు చెప్పి సరదా పడు తూంటాడు.

ఆ రోజు కూడా సింహాచలం చుట్టూ ఒక పది మంది వరకూ చేరారు.

లంక పొగాకు చుట్టను పళ్ళ మధ్య బిగించి, అగ్గిపుల్ల గీశాడు సింహాచలం. పుల్ల వెలగ్గానే ఆరిపోయింది. ఇంకొకటి వెలిగించాడు. అదీ అంతే!

"చస్." అని చిరాకు పడి—"మా రోజుల్లో సయిచే పరక్కొక పెట్టి అగ్గిపుల్ల గీయిస్తే పిరంగి వాగ దామ్మని ఎలిగేది. ఇప్పుడిదంతా ఒట్టినాటుసరుకు, అర్భకం సరుకు" అని చాలా సేపు కష్టపడి చివరకు చుట్ట ముట్టించాడు. గుప్ గుప్‌న రెండు మూడు సార్లు తృప్తిగా దమ్ము లాగాడు.

"ఇదేం సుట్టలు గాని...సుట్ట లంటే మా మేజర్ సారు గోరివి. సెప్తే నమ్మవు గాని బారె డుంటాది ఒక్కోటి. ఒక్కసారి ముట్టిస్తే తెల్లారి పోవాల్సిం గాని, సుట్టారదు. ఆఁ." అన్నాడు.

"ఆఁ?" అంటూ నోళ్ళు వెళ్ళ బెట్టారు మిగిలిన వాళ్ళు.

"మ రా దొంగ గుంటడు జేలు కాడి నుండి...అటు నుండటే ఎళ్ళిపోయాడు గాని, మేజరు బాబు గారి సుట్టా ర్లేదు. తెలుసా!" అన్నాడు, సింహాచలం.

"ఎవ డా దొంగ కుర్రోడు. ఆడి కేటయింది. ఆ డసలు జేలు కెందు కెళ్ళాడు. మ రటు నుండటే శ్మశానాని కెందు కెళ్ళి పోనాడు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు శ్రోతలు.

"సెప్తా...సెప్తా" అని మరో రెండు దమ్ములు లాగి మొదలుపెట్టాడు సింహాచలం.

"మా మేజరు బాబుగోరి పేరు బోసుబాబు. బోసుబాబు బేరక్కొచ్చా డంటే సిపాయోడికాడించి కేప్టెను సక్సేనా బాబు వరకు వూపిరిబిగట్టావల సిందే! ఆ బాబు గుడ్లురిమిజూస్తే... ఎక్కడి పన్లక్కడాగి పోవాల్సిందే.

ఆ బా బెలా గుంటాడంటావేటి? మనూరిసివర ఆసిరమ్మ సెట్టు లేదూ... అంత పొడవుంటాడు. ఆ బాబు మీసాలెగ్గిస్తే... రాండురెక్కల్లాగ.. ఆయనగోరి ముక్కు దాని తలనాగ అగుపడతాదన్నమాట. తొలిసుట్ట సూసి నోడు ఆ రేత్తిరికి వూప్నం ఎట్టేసు కోవలసిందే...

నెలకి రెండు మూడు సుట్లయినా ఆ బాబు టీ పార్టీ ఎడతాడు. ఒక సారి అలాగే పార్టీ ఎట్టిండు. ఎట్టి, నన్నుగాకేసి... "సింహాచలం... బేగెల్లి, కేరేసిల్లో బిరియాని ఉంటది. అమ్మ గోర్నడితే ఇస్తారు. గమ్మునొట్టకొచ్చి" అన్నారు.

ఆ బాబు హుకుం ఇచ్చినాడంటే వైర్‌లెస్ నాగ అరిజెంటుగా జరిగి పోవాలన్న మాటే! మరెందుకని, లగె త్తిన్నా. లగెత్తే ముందు జూసినా—అప్పుడే మేజరు బాబుగోరు సుట్ట ముట్టించి సినారు.

ఆ బాబింటికెళ్ళి... కారేజితెత్త కొస్తా ఉంటే... అప్పుడు జరిగింది ఇసిత్రం.

బజారెంటపడి వస్తున్నాను నేను. ఒకగుంట ఎదవ సర్రున రాసుకుంటూ ఎళ్ళిపోనాడు. ఆ రాపిడికి మరొకడైతే పడిపోయివోడే. నాను గాబట్టి నిలబడి పోనాను. ఆ గుంట నా కొడుక లాగ ఎల్లాడో నేదో... ఒక పది మంది దాకా ఆడెంట పడిపోతన్నారు—పట్టుకోండి... పట్టుకోండి— అని అరచుకుంటూ—

ఎట్టాగయితే నేటి... ఆడి నట్టు కున్నారు.

"దొంగనాకొడుకా! పర్సేదిరా..." అన్నాడొకడు.

ఆ గుంటెదవ ఎర్రి మొగవేసుకు జూశాడు.

"నిన్నే... మాటా డవేటిరా... ఎదవ నచ్చినోడా..." అని పడేలుమని ఒక్క టిచ్చుకున్నారు.

"అయ్య బాబో... నాకెరుకనేదండి, బాబో..." అంటూ ఏడుపు మొద లెట్టాడు గుంటడు.

"దొంగ ఏసా లెయ్యకు..." అని మరోటిచ్చుకున్నాడు ఇంకొకడు.

ఇంతలో అక్కడి కొకాయ నొచ్చాడు. సూడ్డానికి పెద్ద ఆఫీసరు బాబు నాగు న్నాడు.

"దొంగెదవ...పర్సెక్కడో దాచేశాడు, సార్!" అనిఫడేల్‌మని ఒకటిచ్చుకున్నాడు.

"జేబుల్లో వెతకండి." అన్నా డా బాబు.

అప్పుడు సూసినా, ఆ గుంటడిని.

ఆడు అచ్చంగా ఎలికపిల నాగ ఉన్నాడు. పదేళ్ళుంటాయేమో. సింపిపిరి జుత్తు, సిరిగిన లాగు.. పైన సొక్కా నేదు. ఒళ్ళంతా దుమ్మే. గట్టిగా గుద్దితే బొమికలూడొచ్చే నాగున్నాడు.

"జేబిలో లేదండి..." అన్నాడు జేబీ తడిమినోడు.

"ఇంకెక్కడుంటాది...సేతులు మారి పోయుంటాది" అన్నాడు గుంపులో ఎవరో.

ఇంతలో సర్రున వచ్చేశాడు ఎస్సై బాబు!

వచ్చీ రాగానే... గుంటెదవ జుత్తు అందిచ్చుకొని గుభీ గుభీమని నాలుగు గుద్దులేశాడు.

"దొంగనంజికొడకా! ఏలెడంతలేవు అప్పుడే కేటు పనులు మొదలెట్టావ్! నిన్నిలా ఒగ్గేస్తే—రేపు నా జేబే కొట్టే స్తావు... ఎల్లుండి బేంకుకే ఎసరెట్టే స్తావు" అని గుంటెదవ గూబమీద గుయ్యుమని ఒకటిచ్చాడు.

ఆ గుందొదవ ఆ దెబ్బకి కిరకిర సుట్టుకు పోనాడు. ఆ దెబ్బకి సచ్చి పోనాడనే అనుకున్నాను గాని, ఆడు సావలేదు.

తరవాత ఎస్సైబాబు ఆడ్ని టేసన్కి లాక్కుపోనాడు. ఏటవుతదో సూద్దామని నానూ ఎల్నాను.

టేసన్ల ఎస్సైబాబు, హెడ్డుబాబు.. ఆ గుంటడ్ని ఒల్లు హూనం సేసేసి నారు.

ఆ గుంటెదవ ఒక్కటే గోల... "నాను దొంగను కానండో, బాబో..." అని.

"దొంగవి కాప్పోతే... దొరవేట్రా నంజీహడకా! దొంగడెవ్వి గాపోతే మరెందుకు పరుగుచ్చుకునా వ్..."అని అడిగాడు ఎస్సైబాబు.

"ఏమో తెలవదు, బాబూ! మా అయ్యకి జొరం. అమ్మకి జొరం. పస్తులుంటున్నాం. బస్సుస్టాండు కాడ మూటలు మోద్దారని వచ్చినాను. దొంగన్నారు. ఎంట లగిల్నారు. బయ పేసి లగెత్తినా" అన్నా డాడు, ఎక్కుతూ!

తరవాత ఈపు మీద, డొక్కలో, మొగం మీద బాంబు లేసినట్టు ఫెడీ ఫెడీమని నాలు గుచ్చుకున్నాడు.


ఆ గుంటెదవ మరి ఒర్చుకోనేక పీకి పారేసిన తోటకాడ మొక్కనాగ నేల కరిచిశాడు.

ఇంతలో పరుగు పరుగున వచ్చేశారు ఆడి అమ్మా, నాన్నా! అళ్ళిద్దరూ అచ్చం పీనుగుల్లా ఉన్నారు. అలా గుండికూడా ఆళ్ళింకా ఎలాగ బతి కున్నారో అని ఆశ్చర్య మేసింది.

"బాబ్బాబు! కుర్రెదవ... తప్పయి పోనాది. ఈ పాలికి తప్పు కాయండి, మా ప్రభో!" అని ఎస్సైగారి కాళ్ళట్టు కున్నారు.

అప్పుడు సూడూ, ఎస్సై బాబు అగ్గే అయిపోనాడు.

"కుర్రెదవని దొంగ పనికి పంపిస్తాడు




గ్నేపకం లేదేట్రా మీకు, ఆడు కుర్రెద వని! వ వ్వచ్చేసి ఒగ్గేవంటే పలాం కొట్టేసి వగ్గడానికి మువ్వేటి కలకటేరువా, ఎస్పీ దొరవా, మినిస్టరువా? మరవన్నీ కాపోతే లచ్చాధికారివా! ఇయ్యాల ఈడి బొమికె లిరగ్గొట్టి గాని ఒగ్గను. మళ్ళీ ఎదవ పన్లు జేయకుండ ఈడి కళ్ళాడ తీకించేస్తాను. అప్పటి గ్గాని మీ లాటి ఎదవలకి బుద్ది రాదు. దొంగెదవల్ని బుగ్గిడాని క్కాదు వేం ఉన్నది. ఆ." అన్నాడు.

ఆ బాబాలాగ అనీసిం తరవాత ఆ ల్లెల్లి పోవాలా? ఎల్ల లేదు. ఎల్లలేదు సరికదా... ఆ ఆపది ముందు కొచ్చి ఎస్సైబాబు ముకం ల ముక పెట్టి జూసి అన్నాది కదా—

"బాబూ...ఎస్సై బాబు! నా కున్నది అచ్చరాల నిజెం,బాబూ! వేం కలకటేర్లం

కాదు,బాబా! ఎస్పే దొరలం కాం, బాబా. వా మొగుడున్నాడే—ఆడు లచ్చాదికారి కూడా కాడు, బాబా! ఆడు రాగానే మువ్వు నిలబడి పోయి సలాం కొట్టేడానికి!

ఆడు రిచ్చావోడు.

ఆడి రెక్కాడితే తప్పా మా డొక్కాడదు.

మూన్రాజా ల్నుండి జొరం వచ్చి తొంగున్నాడు. దర్మాస్పత్రిల మా కెవరు సూస్తారు! పెద్ద డాట్రు బాబుల్కాడికి పోవడానికి డబ్బు నేదు.

'నా నెల్లి మూటలు మోసి డబ్బు లెస్తానని' బయా లెల్లినాడు గుంటడు.

'బాబా!నువ్వెళ్ళద్దురా'అన్నా.అయినా యినుకోకుండా ఎల్లాడు. ఎల్లి, సివరికి మీా సేతుల బడ్డాడు. ఆడు దొంగ కాడు,బాబా! దొంగలు దర్జా గుంటారు బాబా ఆడి కా దర్జా నేదు, బాబా! అయినా, ఎస్పే బాబా! ఆడు దొంగే నంటావు నువ్వు. అలాగే,బాబా. అలాగే! నీ మాటెందు క్కాదనాల. మారందుకని ఆడి సేతులు నరికించేసి, ఆడి కల్లు పీకించి...''

అని ఆవేశంగా మాట్లాడింది ఆడ పీనుగ!

''ఎంత స్పీచిచ్చింది'' అని డంగై పోవారందరూ.

సరిగా అప్పుడే వచ్చాడు కానిస్టేబిలు ఒక కేటుగాడ్ని వెంటేసుకుని.

వచ్చి కింద పడున్న గుంటడ్ని, ఆడి ఆమ్మా, నాన్నను ఒక సారి చూసి, ఎస్పే బాబు కాడి కెళ్ళి సెవిలో గుసగుస లాడాడు. గుస గుస లాడినాక ఒక పర్సు తీసి బల్లమీద ఎట్టాడు.

సెప్తే మీారు నమ్మరు గాని.. అప్పుడు సూడాం ఎస్పే బాబు మొగం. నెత్తురు సుక్క నేదు. సలి జొరం వచ్చి నోడి నాగ వనికి పోయిండు. వణికి పోయి కుర్చీల కూలబడి పోనాడు.

ఎస్పే బాబు...ఎస్పే బాబే అయినా. ఆ బాబుకూడా మడిసే! ఆ బాబుకీ ఒక తండ్రున్నాడు, ఒక తల్లుంది, పెళ్ళాం వుంది, పిల్లలున్నారు. అందుకని అల్లంతా గావకాని కొచ్చి. తల పట్టుకొని కుర్చీల కూలబడ్డాడు.

కానీ హెడ్డు బాబు చలించ నేదు. 'ఇంత జరిగినాక, ఇంకేటి' అనుకున్నాడో ఏటో, గట్టిగా నవ్వేశాడు.

నవ్వేసి,''అదికాద్సార్. మరి దొంగం టే పట్టుకోవాల కదా! ఆడు దొంగో, కాదో నాలుగు తగిల్నిస్తే గాని బయట పడదు కదా! ఒక్కోసారి అయిజీ బాబే పప్పుల కాలేస్తంటారు. అందుకని మీారు బాధ పడకండి, సార్! ఆ గుంటెదవ ఏ కమీాసనర్ కొడుకో, బిర్లా మేనల్లుడో అయితే మనకి భయ్యం గాని. ఈ దిక్కుమాలిన ఎదవ గురించెవడిక్కావాలి'' ఎసే బాబుతో అని—

''ఒరే. మీా పిల్లా డ్నొట్టుకు పొండి. వగ్గేస్తన్నాను'' అన్నాడు.

ఆదే చాలన్నట్లు ఆ ముసిలాల్నిద్దరూ నేల మీాద పడున్న గుంటడ్ని మోసుకుని బయట కొచ్చారో, నేదో ఒక్కసారి గొల్లుమన్నారు.

ఏటని సూద్దును కదా—గుంటెదవ పేణా లొగ్గేసి నాడు! ఆ తరవాత ఆ గుంటడి పీనుగని అల్లు తీసుకెళ్లేటి సూడటం కంటే నా కా... మ్మనేనానికి మోసుకెళ్ళిపోనారు.

అదంతా సూసుకొని నాను మేజరు బాబుగారి కాడికి తిరిగెల్లే సరికి... నే నెల్లినప్పుడు ముట్టిన సుట్ట ఇంకా ఎలగతానే ఉం దా బాబు సేతిలో.'' అని ముగించాడు సింహాచలం.

''ఒక సుట్ట పూరాగా కాలిపోయేసరికి యింత తతంగమైనా దన్న మాట.''' అన్నాడు, శ్రోతలలో ఒకడు.

''ఒక్క మడిసి పేణం...ఎంతలో పోనాది'' అంటూ సానుభూతితో కూడిన ఆశ్చర్యాన్ని ప్రకటించా డింకొకడు.

''అరే. మడిసి పేణాని కేటుందిరా! ఆడు సావాలని రాసి పెట్టుంటే ఎలా గయినాసత్తాడు.ఆ గుంటడికీ భూమ్మీద నూకలు సెల్లి పోనాయి, ఎల్లి పోనాడు'' అని వేదాంతాల సారాన్నంతా ఒక్క మాటలో బిగించి అన్నాడు ఇంకో వ్యక్తి!

అలా అన్న వ్యక్తి భుజాన్ని డాంసుమని చరిచి—''మా బాగా సెప్పావురా, సిన్నా! మడిసిలోని పేణం పోడానికి ఎంత టయ్యిం కావా లంటావు. మిల్ట్రీలో పన్జేశాను ఎంత మందిని నా యీా సేతులో మైకంపించినా నంటావు? నే లెక్క పెట్టనేదు. అందాక ఎందుకు. ఎన్ని సార్లు నేనే సచ్చి పోవాలి ంది. సావుకి అరించీలో ఎన్నిసార్లు తప్పించుకో నేదు. మరందుకని ఎవుడు సావాలో, ఎవుడు సావకూడదో, సచ్చినోడు ఎవుడి సేతుల్లో పోవాలో...మనం పుట్టి నప్పుడే బెమ్మ దేముడు మన మొగాన్న రాసి పారేశాడు యియన్నీ, ఆక లేసి, తిండి నేక సస్తాడొకడు. యిుద్దంల గుండు దెబ్బ తిని సస్తా డొకడు. మరి రోగ మొచ్చో, రైలు కింద పడో, గుండాగి పోయో, పెదడు పన్జేయ డం మానేసో... ఏదో లాగ సాచ్చి నప్పుడు సచ్చి పోవాలి ందే. సావుకి అడ్డేటి! పోలీసు లేసన్లో పోలీ సోడి సేతుల్లో నీ సావు రాసిపెట్టుంటే ఆ తప్పు పోలీసోడిదా! మరలాగని మన జాతకంలో రాసిన బెమ్మ దేవుడి తప్పు



వెలువడింది!

ఎన్.ఆర్.నంది

కాంచనగంగ

రూ.16-00.MO చేసిన పోస్టుఖర్చులు V.P.P పెడతారు.

పంపిణీదారు:-

పద్మజ పబ్లికేషన్స్.

ఏలూరురోడ్ :: విజయవాడ-2

త్వరలో వస్తూన్న ప్రచురణలు

అలనాటి చరిత్రలు

ఈనాటి మేటి నవలలు


శ్రీ ప్రసాద్ రచనలు

| | |
|---|---|
| సామ్రాట్ శ్రీ రంగరాయ | 10.00 |
| షాజహాన్ | 13-00 |
| విజయనగర పతనం_1 | 13.00 |
| విజయనగర పతనం_2 | 12.00 |
| లకుమాదేవి [రచన లల్లాదేవి] | 15.00 |

[ఆంధ్రభూమి సీరియల్]

నవజ్యోతి పబ్లికేషన్స్

ఏలూరు రోడ్ విజయవాడ-2



నేదా?'' అని సింహాచలం అవర శ్రీకృష్ణ పరమాత్ముడి లాగ అక్కడ కూర్చున్న వాళ్ళకు తత్త్వ బోధన చేశాడు.

తరవాత మరోచుట్ట వెలిగించి—''ఆ గుంట డలా పచ్చి పోయాదా—ఆ షాకు నుండి ఇంకా తేరుకునే లేదు. మరో సావు! అందుకని సావుకి అంతేటె!దానికి అడ్నేటి'' అన్నాడు సింహాచలం.

''మరో సావా!'' అని తెల్ల మొగాలు వేశారు శ్రోతలు.

సింహాచలం నవ్వాడు వేదాంతిలా. ''ఒ లేటిరా అలా గా తెల్లబోతన్నరు. య ఏద్ధంలో రోజుకి ఎంతమంది సస్తా రనుకున్నారు. ఒకే దగ్గిర, ఒకే నిమి సంలో ఎంతమంది సస్తారో నే మ్మాసినా!'' అన్నాడు.

''అద రే గాని, మావా! ఇంకెపురే సచ్చిపోవారు?'' అంటూ అత్రత అణుచు కోలేని ఒక అల్లుడు అడిగేశాడు.

''చెప్తా.'' అని చుట్ట పీకని ఆర్పేసి, దాన్ని చెవి సందులో ఇరికించి, మొదలు పెట్టాడు సింహాచలం.

''మా మేజరు బాబు పార్టీ యిస్తన్నా డని పెప్పాను గదా. మరి దానికి బిరియాని నేనే తెచ్చాను గదా! సత్యెన్నారాయణ అని, అందరూ ఆడ్ని సత్తెం అంటార్లే—ఆడు బాబుగోరి కాడ ఆర్డర్లీ. కొత్త గొచ్చినాడు. ఇద్దరం కలిసి మందు బుడ్లు, బిరియానీ ప్లేటులు, కోడి మాంసం ఏపుడు, రొయ్యల కూర... ఒకటేటి—అన్నీ పర్దేశాం.

పార్టీ కొచ్చినోళ్ళు మొత్తం ఆరు మంది—అందరూ పెద్దోళ్ళే! ఒకాయ నేమో కాంట్రాక్టరుగారంట, మరో ఆయన డాట్రు, ఒకాయన కలకటేరు కాదు గాని ... అంతోడే! ఇంకోబాబేమో ఆయనకేం పన్లేదు—బాగడబ్బున్నోడులే! ఉట్టినే కర్చెట్టుకోవడమే పని. ఆర్ని అందరూ 'రాజ'గా రంటారు మరో ఇద్దరు కెప్టెన్లు.

పార్టీ మొదలయింది.

తాగుతున్నారు. తింటున్నారు. మళ్ళీ తాగుతున్నారు. మళ్ళీ తింటున్నారు.

మద్దె మద్దెన నవ్వులు. కేకలు!

కంట్రాక్టరని జెప్పానే ... ఆ బాబే అనుకుంటాను. ఆ బాబు అన్నాడుకదా ''రాజాగారూ! కతేదయినా సెప్పండి!'' అని.

''అవునవు'' నని అందరూ అడిగీ శారు!

రాజారావు నవ్వేశారు.

''అలాగే ... అలాగే ... మీరంతా అడుగుతా ఉంటే కాదంటానా ...'' అని బ్రాందీని గ్లాసులో సగం వరకూ ఒంపి, సోడా కలపకుండా లాగించేశారు.

తర్వాత సెప్పడం మొదలెట్టారు.

''శానాకాలం క్రీతం మాట. ఒక పాతికే ళ్ళయుంటాది. నా నింకా వయ సులో ఉన్నా నప్పుడు. మందస అడవికి వేట కెల్లాను. నాల్రోజు లున్నాం బంగ్లాలో. వేట బాగానే అయింది. రోజూ తుపాకి భుజా నేసుకొని పొద్దునే ఎల్లిపోవడం ... ఏ దుప్పినో, అడివి పందినో ఏసుకు రావడం.

తెచ్చినదాన్ని వండించితినడం. తాగడం ఇదేపని!

అప్పుడే ఒక గొప్ప అనుభవం జరి గింది ... అని ఆగి, మిజీలిన వారివైపు చూసి నవ్వారు, రాజాగారు!

''అర్థమైపోనాది ... ఎవరా పిల్ల'' అన్నారు డాట్రుబాబుగోరు నవ్వేసి.

రాజాగారు కూడా నవ్వేశారు.

''దానిపేరు గౌరి'' అన్నారు.

ఇంతలో దాబ్మని చప్పుడు. అందరూ తుల్లిపడిపోయి చూసే సత్తెంగాడు ఏదో ఎత్తేశాడు.

''ఏట్రా అదీ'' అన్నారు, మేజరు బాబుగారు సిరాగ్గా!

''సెయ్యిజారిపోనాది, బాబూ!'' అన్నాడు సత్తెం.

''సర్లే ... సరి సరి ...'' అనేసి వూరుకున్నాడు మేజరుబాబుగారు.

రాజాగోరు మళ్ళీ మొదలెట్టారు.

''దానిపేరు గౌరి! దాన్నిచూస్తే అడివి పూలకున్న అందం మన గులాబీ లకు లేదనిపిస్తాది. దానికి అందంఉన్నాది. ఆరోగ్య మున్నాది. వయసున్నాది.

సరే ... మరి — లైనేశాం ...

మొత్తం మీద వల్లో పడింది.

పడిందిగాని ... షరతొకటిపెట్టింది. పెళ్ళిచేసుకోవాలని.''

''తమరు ... సరే అన్నారు. శభాష్'' అన్నారు కెప్టెనుబాబుగా రొకాయన.

''నిజమే. అలాగే అన్నాం. పక్షం గడిచిపోయింది'' అంటూ కతచెప్పాడు, రాజాగోరు!

అందరూ చప్పట్లు కొట్టేనారు.

''మ రా పిల్ల ఏటయుంటాది?'' అన్నారు మేజరు బాబుగారు!

''ఏటుంది ... ఎవడ్నో మరొకడ్ని తగులుకునుంటాది'' అన్నారు కంట్రా క్టరు బాబు!

''కాదు. రాజాగోరికోసం జూసి, జూసి ... నుయ్యో, గొయ్యో చూసుకు నుంటాది'' అన్నాడు కుర్ర కెప్టెను.

''ఒక వేళ కడుపయుంటే తీయిం చీసుకునుంటాది''అన్నాడు డాట్రుబాబు,

అప్పు డేటయిందో తెలుసా ...

సత్తెంగాడు లేడూ—ఆడు ముందు కొచ్చి అన్నాడు:

''కాదు బాబూ ... మీరంతా తప్పే సెప్తన్నారు. ఆ యమ్మ ఏటయిందో నే సెప్తాను ...'' అన్నాడు.

అందరూ ఆచ్చెర్యపోయారు.

''సెప్పు ... సెప్పు ...'' అన్నారు.

''ఆయమ్మ మరొకడితో పోనేదు, బాబూ! అలాగని సచ్చిపోనేదు కూడా.

బాబూ డాట్రుబాబూ! తమరు సెప్పినట్లు ఆయమ్మకి నెలతప్పడం నిజమేగాని, కడుపు తీయించుకోనేదు, బాబూ!

తనని అనుబవించిన బాబొస్తాడేమో నని చూసి చూసి అలా ఎదురుచూస్తానే ఒక పసికందును కన్నాది.

వూర్లోలంతా 'ఛీ...ఛీ' అని తగిలేస్తే వూరవతల గుడిసెలో కొడుకుతో బతికినాది, బాబూ!

ఆ కొడుకుని పెద్దోడ్ని సేసి ఏదో సేసెయ్యాలని కలలు కనీ చివరి కో రోజు సచ్చిపోనాది.

ఆయమ్మ సచ్చిపోయే సరికి కొడుక్కి పదేనేళ్ళు.

సచ్చిపోయేముందల 'ఒరే తండ్రీ... నీ బాబు నెతికి పట్టుకోరా' అని మరీ సెప్పింది.'' — అని ఆగాడు సత్యం.

అందరూ నోళ్ళు తెరిచేసి యింట న్నారు.

''ఇదంతా నీ కెలగ తెలుసు'' అడి గారు మేజరుబాబుగారు.

''వాడు ... అదే ... దానికొడుకు, బతికే ఉన్నాడా?'' అడిగారు రాజాగారు.

సత్తెం నవ్వేడు.

నవ్వి అన్నాడు గదా—''ఆడు దాని కొడుకేగాని... మీ కొడు క్కాదేటి'' అని!

''సరి ... సరి ... అట్లాయితే ఈ పాటికి నాకు వూరికొక కొడుకు, పేట కో కూతురు ఉంటాది ...'' అని నవ్వేశారు, రాజాగోరు.

అప్పుడు సత్తెన్ని చూస్తే ... నాకే బయ్యం వేసింది. నిప్పునాగ ఎర్రగుం.

పోయాడు. తాగినోడిలాగ వూగిపోయాడు తర్వాత ఆడు ఆడిన మాటలు...మాటలు కావు ... పిడుగులు.

''అవును, బాబూ ...''

తమరికి వూరి కొక కూతురు, పేట కొక కొడుకు ఉంటారు. కానీ ఆల్లెవరో తెలీదు, మతమకి!

కానీ బాబూ ... ఆల్లని కనేసిన అమ్మ లున్నారే... ఆల్లకి తెలుసు బాబూ! తమ బిడ్డలెవరో.

మరి ఆ బిడ్డలక్కూడా తెలుసు బాబయ్యా ... ఆల్ల అమ్మ లెవరో.

అమ్మలుమాత్రమే తెలిసి, అయ్య లెవరో తెలీని ఆల్లేటి సేస్తారో తెలుసా, బాబూ ...

తమ అమ్మల్ని ఆయిదంగా అన్యాయం జేసి, అవమానం జేసినందుకు జనమలో ఆ అన్నేయం జేసినోడు ఆగుపిస్తే ...

ఆడ్ని ముక్కలు ముక్కలుగా నరికి పోగులెడతారు.''

అడి ఆవేశం జూసి రాజాగారు కంగా రడిపోనారు.

''నువ్వు... ను వ్వెవరు?'' అన్నారు.

ఆ సత్తెంగాడు ... ఒక్కసారి ఎంయ్యి బాంబులు పేలినట్లు నవ్వాడు.

''నువ్వు జెప్పావే జాడు, గౌరమ్మ ... ఆ యమ్మ కొడుకుని. ఆయమ్మ ఆత్మ శాంతించడానికి ... ఎతుకుదున్నా, నీ కోసం. దొరికినావ్ ... కాసుకో'' అని ఒక్కరుపు అరిసి ... కన్ను మూసి తెరిసేలోగా రాజాగోరి మీదపడి మొలలో దాసుకున్న కత్తిని సర్రునలాగి కసా, బిసా పొడిచి పారేశాడు.

ఎయ్యి పీనుగుల్ని పీక్కుతిన్న రాంబందు ఒక్క గాలి వానతోసరి అని రాజాగోరు రక్తం మడుగులో సచ్చి పడున్నాడు.

ఎంత యిసిత్రం.

కష్టవంతా పుట్టేవోడిగ్గాని సావ టానికి చనం పట్టదు. బతికినోడికే అన్నీ గాని ... సచ్చినోడికి ఏదీ మిగలు .

రాజాగోరైతే ... సచ్చిపోనాడుగాని, సత్తెంగాడిని మాత్రం పోలీసు లట్టుకు పోయారు. ఆ తరువాత ఆడ్ని అండ మానే అంపిచ్చినారో, ఉరికంబమెక్కించి నారో ... నాకు తెలియదు'' అంటూ ముగించాడు సింహాచలం.

''రాత్రి శానా పొద్దుపోనాది గాని... ఇంకెల్లి తొంగోండి ...'' అని అందర్నీ పంపేసి ...

చెవిలో చుట్టపీకను లాగి, పళ్ళమధ్య బిగించి ... డాంమ్మని అగి పెట్టె వెలిగించి గట్టిగా రెండు దమ్ములాగి తృప్తిగా నవ్వుకున్నాడు సింహాచలం.

★